# అమ్మా నేనూ

- డాక్టర్ రాగతి రమ



తెల్లవారింది. కానీ నా మనస్సు వాకిట్లో చీకటి ముద్దగా పేరుకుపోయి ఉంది.

"తెల్లవారింది... లేవవే నీలూ - ఏమిటా ఎద్దులా మొద్దు నిద్ర? లెగు లెగు - లేచి చదువుకో లేదా నాకు పనిలో సహాయం చేయి - సిగ్గు సిగ్గు ఆడపిల్ల అంత సేపు పడుకోవడమే! రేపు నువ్వు అత్తారింటికి వెళ్తే నన్నే అంటారు... లెగవే లెగు..." రోజూ ఆంజనేయ దండకంలా వినిపించే అమ్మ గొంతు వినిపించడంలేదు.

నాకు చిరాకును, కోపాన్ని తెప్పించే అమ్మ గొంతు వినిపించడం లేదు. నాకు చాలా బాధగా ఉంది. ఆ గొంతు వినిపించాలి. ప్రతిరోజూ ప్రతి పనికీ నా మీద యుద్ధం చేసే ఆ గొంతు వినిపించాలి. నాకు అమ్మ మాటలు వింటుంటే కసిగా ఉండేది. ఇప్పుడా కోపం జారిపోయింది. అమ్మ గొంతు వినిపించకపోతే జీవితం డల్‌గా ఉంది. వెచ్చని కన్నీళ్ళు బుగ్గలపై జారుతూ ఉంటే అమ్మ జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి.

* * *

నేను పిల్లిలా హాలులోకి ప్రవేశించాను. అమ్మా, నాన్న అక్కడ సోఫాలో కూర్చుని ఉన్నారు. అమ్మ కంట పడకుండా వీధిలోకి జారుకోవాలని నా ఉద్దేశ్యం. కానీ అమ్మ నన్ను చూసేసింది.

"చూడండి... చూడండి... దాని వేషం. చక్కగా చీర కట్టుకోక ఆ ఫాంటూ షర్టూ ఏమిటి? నా మొఖంలా ఉంది. మీరు దాన్ని నెత్తి మీదకు

ఎక్కించుకున్నారు. ఇలాగేనా ఉండేది అమ్మాయిలంటే... ఆ జుత్తు చూడండి... పిచ్చిదానిలా. ఉన్నావే నువ్వు... గట్టిగా జడ వేసుకోక ... ఇది నా మాట వినదు... చెప్పండి మీరైనా?" నాన్న చేతిలో పేపరు విసిరికొట్టి అమ్మ గట్టిగా అంది.

హబ్బ కంటపడితే చాలు పరాయిదానిలా పీక్కుతింటుంది. చిరాకుని మనస్సులోనే అదిమి పట్టి, నేను హైహీల్స్ తొడుక్కుంటూ ఓరగా అమ్మ వేపు చూశాను. ఇక్కడ మరో రామ రావణ యుద్ధం ఉంటుందేమో! నమిలి మింగేసేలా చూస్తోంది నా వేపే. చకచకా వచ్చింది నా దగ్గరకు.

"ఏమిటమ్మా అంతలేసి ఎత్తు మడాల జోళ్ళు, మూడు వందలు తగలేసి కొన్నావు... ఏం బాగున్నాయవి? కొంగలా ఉన్నావు అసలే... చాల్లేదా...? ఈ జోళ్ళు తగిలిస్తే ఆకాశానికి వెళ్ళిపోతావు. ఏమి ఫేషన్లో ... పాడు ఫ్యాషన్లు.... చక్కగా ఆకు చెప్పులు కొనుక్కోవే.... బాగుంటుంది" అంటూ అక్షింతలు జల్లింది.

రోజూ అరిగిపోయిన రికార్డులా వెధవ సొద - నాకు కోపం తన్నుకొచ్చింది.

"ఏమిటమ్మా ఏమి చేసుకున్నా తప్పే నీకు? కట్టుకోనివ్వవు పెట్టుకోనివ్వవు. బూజు పట్టిన పాత చింతకాయ పచ్చడి కబుర్లు చెప్తావు. అలా వీధిలోకి వచ్చి చూడు... అమ్మాయిలు ఎంత ఫ్యాషన్‌గా తయారవుతున్నారో తెలుస్తుంది" అనేసాను.

"అను అను, నన్నే అనే స్టేజీకి వచ్చేసావన్న మాట. ఆ బోడి ఫ్యాషన్లు వద్దనే నేననేది" అని అమ్మ ఇంకా ఏదో అనబోతూ ఉంటే నాన్న అడ్డు తగిలారు.

"రాజేశ్వరీ ఊరుకో... రోజులు మారాయి.

## చైతన్య విలసనము

గాలివానకు కుప్పకూలిన మహావృక్షము
మోడు చిగురిస్తుంది
మోసులెత్తి పెంపొందుతుంది
ప్రకృతి విలాసముగ
పొంగిపొరలిన జలరాశిలో
దిబ్బలైన రాజనాల క్షేత్రాలు
అంకురాల కాలంబనము
పంట సిరులకు ఆటపట్టు
అవుతాయి అది యేమి లీల!
పర్వత సీమలలో
కఠిన శిలా పరివేష్టితమై
వెలసిన చెలమలు, దివ్యకాసారాలు,
ఎలా అది సాధ్యం?
అదియే ప్రకృతి రహస్యం
చైతన్యం విలసనం
కావాలి ఆదర్శము ఆచరణకు
మనిషి మనసుకు
మనుగడ ధన్యతకు

- అరుణప్రియ'

అమ్మాయిలు ఫాంటులు, చొక్కాలు వేసుకుంటే తప్పు పట్టే రోజులు కావివి - మారే రోజులకి అనుగుణంగా మనమూ మారాలి. అమ్మాయినెందుకు సంజాకు తింటావు?" అన్నారు చిరాగ్గా.

"మీరు మరీను... అన్నింటికీ ఊరుకోమంటారు.

మంచి చెప్తే రోజులు మారాయంటారు. ఆ ఎత్తు చెప్పులు వేసుకుని అదెలా నడుస్తుంది? జారిపడితే!"" అంది గట్టిగా.

"పర్వాలేదమ్మా. అర్థంలేని భయాలు నీవి. ఇవి నాకలవాటే. జారిపడను" అన్నాను అంతే గట్టిగా.

ఇంతలో గోడ గడియారం ఠంగుమంటూ ఏడు గంటలు గొట్టింది. అమ్మ ఒకసారి గడియారం వైపు చూసి నన్ను ఎగాదిగా చూసింది.

"ఇంత వేళప్పుడు ఎక్కడికి షికార్లు? రోడ్డు మీద రౌడీలుంటారు. వెళ్ళొద్దే... వెళ్తే ఈ రౌడీల సంగతి నాకు తెల్సు. అమ్మాయిల్ని ఏడిపించి ఏడిపించి నానా బాధలూ పెడతారు. అందుకే ఈ వేళప్పుడు నువ్వు వెళ్ళడం నాకిష్టం లేదు. పద ఇంట్లోకి" అంది పెద్దగా.

"అమ్మా ఎందుకు నువ్వు ఊరికే గాభరా పడతావు? నా ఫ్రెండ్ సుమ దగ్గర కంప్యూటర్ ఉంది. అది నేర్చుకోటానికి వెళ్తున్నాను. ఒక గంటలో వచ్చేస్తాలే. ఎందుకు హైరాన పడతావు? చీటికి మాటికి అరుస్తూనే ఉంటావు" చిటపటలాడుతూ అన్నాను.

"ఒక గంట అంటావు... తొమ్మిది దాటితే గానీ దిగబడవు. ఈ రోజులు మునుపటి రోజుల్లా కావే. పాడు రోజులు ఆడదాన్ని ఆబగా చూసే రోజులు. ఒద్దంటే మాటకు మాట సమాధానం ఇస్తావు. తలబిరుసు ఎక్కువైపోతోంది నీకు. చిలక్కి చెప్పినట్లు ఎన్నిసార్లు చెప్పినా అర్థం చేసుకోవు కదా! ఇదిగో నీకే చెప్పేది ఇంట్లోకి పద..." అమ్మ ఇంకా ఏదో అంటూనే ఉంది. నేను పదే పదే ఇది మామూలే అనుకుంటూ బైటకి నడిచాను.


* * *

తెల్లవారింది. అమ్మ గొంతు కంగున మ్రోగుతోంది. "నీ తోటివాళ్ళంతా లేచి పనులు చక్కబెట్టుకుంటూ వుంటే ఏమిటే మొద్దు నిద్ర. ఆడపిల్లలకు అంత నిద్ర ఉండకూడదు. లెగు, లేచి తయారవ్వు.

టైముకు ఏ పనీ చేయవు కదా! హాయిగా కూర్చుని తినమంటే రెడీ. ఏ పనీ చేతకాదు. ఎందుకూ పనికిరావు. మీనాన్నను అనాలి ఇలా పెంచినందుకు..."

ఆ అరుపులు అలవాటైపోయాయి. నింపాదిగా లేచి బాత్‌రూమ్‌లోకెళ్ళి బ్రష్ చేసుకున్నాను. అక్క, అన్నయ్య, తమ్ముడు ఎవరి తొందరలో వాళ్ళున్నారు. మా కాలేజీ పన్నెండింటికి. అందుకే ఇంత తాపీ. అయినా సుఖంగా ఓ ఐదు నిముషాలైనా నన్ను ఉండనివ్వదు కదా ఈ అమ్మ.

వంటింట్లోకి వెళ్ళాను. "ఇదిగో పాలు" అంది అమ్మ గ్లాసు అందిస్తూ. "నేను తాగనని నీకు



# అవునా?

ఆకులు రాల్చిన తరువు
కొత్త చిగుళ్ళు తొడిగితే
అది వసంతం!
పురిటినొప్పులతో తల్లి
బిడ్డను ప్రసవించి నవ్వితే
అది మాతృత్వం!
కడుపు కట్టుకుని కూడేసిన ధనం
కుంటికీ, గ్రుడ్డికీ ధారపోస్తే
అది ధాతృత్వం!
బడుగు జీవుల బ్రతుకును
పరిహసించక
చేయూతనిచ్చి ఆదుకోవటం
అది మానవత్వం!
మహిళా మణులకు
చట్టసభల్లో ఎంత శాతం .
కేటాయించాలనే కన్న
అర్ధ నగ్న చిత్రాలతో అవమానించి
బజారు పాలు చేయక
మాతృమూర్తులుగా గౌరవిస్తే మిన్న!
బంధానికీ, అనుబంధానికీ
ప్రేమ సూత్రం కావాలి
ముడివేస్తే అది పవిత్ర బంధం
విడదీస్తే విప్రలంబం!

**- చాడ రమణమూర్తి**

తెలుసు. పాలు నాకు అక్కరలేదు" చిరాగ్గా అన్నాను.

పాల గొప్పతనం గురించి పాఠం చెబుతూనే టీ కప్పు అందించింది అమ్మ. అన్నం దగ్గర అదో రాద్ధాంతం. నాకు ఇష్టం లేని కూరలు ఇష్టం చేసుకుని తినమని పోరు, అత్త పోరులాగ! ఆ కూరల్లో ఏమి ఏమి విటమిన్లు ఉన్నాయో ఉపన్యాసం దంచుతుంది.

రోజూ ఇదే కార్యక్రమం. నేను మెళ్ళో గొలుసు వేసుకుని బైటకి వెళ్ళకూడదు. బైట దొంగలుంటారన్న భయం. ఫ్రెండ్స్‌తో బీచ్‌కి వెళ్ళకూడదు. నీళ్ళల్లోకి దిగి పొరపాటున సముద్రంలో కొట్టుకుపోతానేమోనన్న భయం. ఫ్రెండ్స్‌తో హోటల్‌కి వెళ్తే పిచ్చి వంటలన్నిటినీ తిని ఆరోగ్యం పాడు చేసుకుంటానేమోనన్న భయం. ఫ్రెండ్స్‌తో సినిమాకెళ్తే అబ్బాయిలు ప్రక్క సీటులో కూర్చుంటారేమోనన్న భయం. మా క్లాస్‌మేట్ అబ్బాయిలెవరన్నా ఫోను చేస్తే రాంగ్ నెంబర్ అని ఫోను పెట్టేస్తుంది. నేను ప్రేమలో పడిపోతానేమోన్న భయం!

నేను వేసే ప్రతి అడుగూ భయమే. మమ్మల్ని కాలేజీ వాళ్ళు టూరుకు తీసుకెళ్తున్నారని చెబితే నువ్వు ఏ టూరుకీ వెళ్ళొద్దు. రైలు ప్రమాదాలు జరుగుతాయి అని పాతిక పేజీల లెక్చర్ దంచుతుంది. నాకు అమ్మ అంటే చెడ్డ చిరాకు ముంచుకొస్తుంది. ఏం చేయను? నా పని నాదే, అమ్మ పని అమ్మదే.

* * *

ఆ రోజు కాలేజీ నుంచి అయిదు గంటలకల్లా ఇంటికొచ్చాను. పక్కింటి ఆవిడ పిడుగులాంటి వార్త చెప్పింది. అమ్మ మెట్లు మీద నుంచి జారి పడింది. కాలు విరిగింది. ఇప్పుడు అమ్మ హాస్పిటల్లో ఉంది. అంతా అక్కడే ఉన్నారట. నాకు బుర్ర తిరిగిపోతోంటే హాస్పిటల్ చేరుకున్నాను. బెడ్ మీద కాలుకి కట్టుతో పడుకుని ఉన్న అమ్మని చూడగానే అంతులేని జాలి కలిగింది.

"ఏ భగవాన్ ఏమిటిది...? మా అమ్మని ఎందుకు శిక్షించావు? నేను దాచుకున్న నా డబ్బులు వంద రూపాయలు నీ హుండీలో వేసుకుంటాను. దేవా! మా అమ్మని రక్షించు" అనుకుంటూ ఉంటే కళ్ళల్లో నీళ్ళు చేరాయి.

ఆ రాత్రి నాన్న అమ్మ దగ్గిరే ఉన్నారు. అందరం ఇంటికొచ్చేశాం!

* * *

రోజులు బరువుగా సాగుతున్నాయి. అమ్మగొంతు వినిపించడం లేదు. శ్మశానవాటికలా ఉంది ఇల్లు. బాధగా రంపాలతో కోసినంత బాధగా ఉంది నాకు. ప్రతి పనిలోనూ అమ్మ జ్ఞాపకాలు నన్ను రాసి రంపాన పెడుతున్నాయి. పెడసరంగా నేనిచ్చే సమాధానాలు గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు చేరుతున్నాయి. "అమ్మా ఇంకెప్పుడూ నీకు ఎదురు చెప్పనమ్మా! నీకు ఇష్టమొచ్చినట్లుగానే నేను ప్రవర్తిస్తాను" మనసులో ఒట్టు పెట్టుకున్నాను.

* * *

నెల రోజులు భారంగా వెనుతిరిగాయి. అమ్మను హాస్పిటల్ నుంచి ఇంటికి తెచ్చేశారు.

అమ్మ కొంచెం నడవగలుగుతూ ఉంది ఇప్పుడు. మరో నెల రోజుల్లో అమ్మ మామూలు మనిషైపోయింది. పరీక్షలు దగ్గిర పడుతున్నాయి. నోట్స్ తెచ్చుకుందామని మా ఫ్రెండ్స్ ఇంటికి బయలుదేరాను. ఫాంటూ, షర్టూ తొడుకొని ఉన్న నన్ను చూసి అమ్మ గొంతు కంగున మ్రోగింది.

"అమ్మాయిలంటే లక్షణంగా చీర కట్టుకోవాలి. ఏమిటీ వేషం మగోడిలా...చిలక్కి చెప్పినట్లు చెప్పినా నా మాట వినిపించుకోవేం? అవునులే పెద్దగా ఎదిగిపోయావు కదా! ఆరిందలా అయిపోయావు కదా! నా మాటలు వింటే నామోషీ..."

"హబ్బ అమ్మో! ఊరికే నస పెట్టకు. నేను నా ఇష్టం వచ్చిన డ్రెస్సే వేసుకు తిరుగుతాను. నా ఇష్టం మరీ పాత చింతకాయ పచ్చడి కబుర్లు చెప్పకమ్మా!" నేను రుసరుసలాడుతూ వీధిలోకి నడిచాను. అమ్మ ఇంకా ఏదో అంటూనే ఉంది.

